మొక్కజొన్న సాగు..
దిగుబడి బాగు

- వరికి ప్రత్యామ్నాయంగా సాగుకు మొగ్గు
- నియోజకవర్గంలో 2,300 ఎకరాల్లో సాగు
- రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు


సాగు చేస్తున్న మొక్కజొన్న

సరుబుజ్జిలి: అతి తక్కువ ఖర్చుతో స్వల్పకాలంలో అధిక దిగుబడులు ఇచ్చే పంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. సాధారణ పంటలు వలన ఆశించిన ప్రగతి కనిపించకపోవడంతో రైతులు వాణిజ్య పంటలను సాగు చేయడానికి ముందుకు వస్తున్నారు. ఈ మేరకు ఆమదాలవలస నియోజకవర్గంలోని నరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో రైతులు మొక్కజొన్న పంటపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. నియోజకవర్గంలోని 4 మండలాల్లో దాదాపు 2,300 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం అన్ని పంటల కంటే మొక్కజొన్న పంటే లాభదాయకంగా ఉండడంతో మొగ్గు చూపుతున్నారు. గతంలో ఆమదాలవలస నియోజకవర్గంలోని కొద్ది గ్రామాల్లోనే మొక్కజొన్న పంటను సాగు చేసేవారు. అయితే ప్రస్తుతం చాలా గ్రామాల్లో విస్తృతంగా సాగు చేస్తున్నారు.

మండలం	మొక్కజొన్న సాగు(ఎకరాల్లో..)
ఆమదాలవలస	400
పొందూరు	750
బూర్జ	800
సరుబుజ్జిలి	350

తక్కువ పెట్టుబడితో...

మొక్కజొన్న పంటకు తక్కువ పెట్టుబడితో పాటు, తక్కువ నీరు సరిపోతుంది. అలాగే మొక్కజొన్న పంటను మార్కెట్‌లో అనేక రకాలు విక్రయించవచ్చు. ప్రధానంగా వీటిని చిల్లర మార్కెట్లో విక్రయించి లాభాలు ఆర్జిస్తున్నారు. కుంకుల నుంచి విత్తనాలు వేరుచేసి పశువులు, చేపల ఫీడింగ్ కోసం కూడా వినియోగించుకోవచ్చు.

అలాగే వీటి పౌడర్‌ను పలు రకాల వంటకాల్లోనూ వినియోగించడం వలన గిరాకీ ఉంది. నరుబుజ్జిలి మండలంలోని యరగాం, తెలికిపెంట, పాతపాడు, అగ్రహారం, పెదమాలపేట, రావివలస, అవతరాబాద్, కొండవలస గ్రామాల్లో సాగు చేస్తున్నారు. అలాగే బూర్జ మండలం గుత్తావల్లి, నారాయణపురం, లాఖాంలో, పొందూరు మండలంలోని బొడ్డేపల్లి, సింగూరు, కింతలి, కనిమెట్ట, తోలాపి గ్రామాల్లో, ఆమదాలవలస మండలంలోని పొన్నాం, బట్టేరు, ఎన్టీవాడ, కొరగాం గ్రామల్లో ఈ పంటసాగు గతంలో కంటే అధికంగా పెరిగింది.

ఆర్థికంగా బాగుంటుంది



మిగిలిన పంటలు పండించినా పెద్దగా కలిసిరాని పరిస్థితులు ఉన్నాయి. వ్యవసాయ అధికారులు ఇచ్చిన సూచనల ప్రకారం మొక్కజొన్న సాగు చేస్తే ఆర్థికంగా ఆదుకుంటుంది. మొక్కజొన్న విత్తనాలు కూడా మండల కేంద్రాలకు రప్పించి రైతులకు అందిస్తున్నారు.

– ఎల్.విశ్వేశ్వరరావు, రైతు, కొండవలస

ఎక్కువ లాభాలు



మొక్కజొన్న పంట లేకపోతే చాలా ఇబ్బందులు ఎదురయ్యేవి. ఉల్లి, టమాటా పంటలు పండించినా ఆశించిన ధరలు రావడం లేదు. ప్రస్తుతం మొక్కజొన్న పంటే లాభదాయకంగా ఉంది. మార్కెట్లో పంటకు మంచి గిరాకీ ఉంటుంది. అందుకే ప్రతీ ఏడాది సాగు చేస్తున్నాం.

– పి.నర్సయ్య, రైతు, నారాయణపురం

వాణిజ్య పంటలే మంచిది

మొక్కజొన్న సాగుపై రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. జీరో టిల్లేజ్ విధానంలో విత్తునాటే విధానంపై పలుమార్లు రైతులకు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చాము. రైతులకు రాయితీపై మొక్కజొన్న విత్తనాలు సరఫరా చేయడం జరిగింది. నూతన పోకడల్లో వాణిజ్య పంటలు సాగుచేస్తే ప్రయోజనం ఉంటుంది.

– బి.పద్మనాభం, మండల వ్యవసాయాధికారి, సరుబుజ్జిలి

క్లుప్తంగా

నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి


పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

పాతపట్నం: జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు శనివారం జరగనున్న పరీక్షకు పాతపట్నంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంఈవోలు ఎ.గోవిందరావు, సీహెచ్ తిరుమలరావులు తెలిపారు. పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 312 మంది, అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల(బ్రిడ్జి స్కూల్) పరీక్ష కేంద్రంలో 264 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. శనివారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాలకు పరిశీలకులు, సూపరింటెండెంట్లను నియమించామన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయం ఏర్పాటు చేశామన్నారు.

సొంత నిధులతో తాగునీటి సరఫరా


ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: మండల కేంద్రంలో గ్రామానికి చెందిన ఎరుసు శ్రీనివాసరావు అనే వ్యక్తి తన సొంత నిధులతో పలు వీధులకు ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా శుక్రవారం చేపట్టారు. గ్రామ పంచాయతీలో కుళాయి నీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పండగ పూట ఇక్కట్లు పడకూడదనే సొంత నిధులతో నీరు అందిస్తున్నానని ఆయన తెలిపారు.

అభిప్రాయాల సేకరణ


మాట్లాడుతున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు, సీఆర్పీలు, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని తహసీల్దార్ హనుమంతురావు, ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద్‌లు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవో నంబర్ 117కు ప్రత్యామ్నాయంగా అభిప్రాయాలు సేకరించారు. సమావేశంలో జరిగిన చర్చపై నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి సునీత

నరసన్నపేట: రబీలో రైతులు వేసే పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి సునీత సూచించారు. మండలంలోని గొట్టిపల్లి, చిక్కాలవలసల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అపరాల పంటలు అంత ఆశాజనకంగా లేవని, ప్రస్తుతం పువ్వు, పిందెల్లో ఉన్నాయన్నారు. అవసరాన్ని బట్టి పురుగు మందులు పిచికారీ చేయాలని సూచించారు. అలాగే సన్ ఫ్లవర్, నువ్వు, మొక్కజొన్నల్లో యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతి చెందిన రేగాన సూరయ్య (ఫైల్)

బూర్జ: మండలంలోని తుడ్డలి గ్రామానికి చెందిన రేగాన సూరయ్య(64) శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం వేకువజామున మరణించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు జనవరి 1వ తేదీన తుడ్డలి ప్రధాన రహదారిపై నడుచుకొని వెళ్తుండగా శ్రీకాకుళం నుంచి పాలకొండ వైపు మోటారు వాహనంపై వస్తున్న వ్యక్తి బలంగా ఢీకొన్నాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన సూరయ్యను స్థానికులు గుర్తించి, వెంటనే పాలకొండలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం రాగోలు జెమ్స్ ఆస్పత్రి, విశాఖపట్నంలోని మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృత్యువాత పడ్డారు. మృతుడికి భార్య నర్సమ్మ, ముగ్గురు వివాహమైన మగ పిల్లలు ఉన్నారు. మృతుడు కుమారుడు రేగాన పోలినాయుడు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి


పొందూరు: అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

పొందూరు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని ఎస్‌ఐ వి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని రాపాక కూడలి వద్ద హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్మెట్ వినియోగించడం ద్వారా ప్రమాద సమయంలో ద్విచక్ర వాహనదారులు తమ ప్రాణాలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. హెల్మెట్ వినియోగించని వాహనదారులకు అపరాధ రుసుము విధిస్తామని హెచ్చరించారు.


పాతపట్నం: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ శ్రీనివాసరావు

పాతపట్నం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వలన సురక్షితంగా ప్రయాణం సాగించవచ్చునని పాతపట్నం ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు అన్నారు. పాతపట్నం పంచాయతీ కార్యాలయం, బస్టాండ్ వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. చిన్న పొరపాటు జీవితాన్ని అంధకారంలోకి నెట్టివేస్తుందన్నారు. ఆయనతో పోలీసు సిబ్బంది ఉన్నారు.

రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయాలని వినతి

పొందూరు: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 188లో ఉన్న సోషల్ క్లబ్‌ను కొంతమంది వ్యక్తిగత రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నిస్తున్నారని, దానికి సంబంధించి ఎటువంటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగకుండా నిలుపుదల చేయాలని సర్పంచ్ రేగిడి లక్ష్మి, క్లబ్ సభ్యులు కోరారు. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం శుక్రవారం అందజేశారు. 60 ఏళ్లుగా సోషల్ క్లబ్ ఉన్న ఈ స్థలంలో ఇప్పుడు ఒక వ్యక్తి వ్యక్తిగతంగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు యత్నిస్తున్నాడని తెలిపారు. సోషల్ క్లబ్ నిర్వాహకులు క్లబ్ పేరుమీద పంచాయతీకి పన్నులు చెల్లించారని చెప్పారు. క్లబ్ పరిరక్షణకు పొందూరు ప్రజలు పోరాటానికి సిద్ధంగా ఉన్నారన్నారు.


వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ లక్ష్మి, క్లబ్ సభ్యులు

విజేతగా పరశురాంపురం

మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన పీపీఎల్–5(పరశురాంపురం ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పరశురాంపురం లెజెండ్స్ టీమ్ నిలిచింది. శుక్రవారం నిర్వహించిన ఫైనల్‌లో పరశురాంపురం లెజెండ్స్, తోవూరు థండర్స్ జట్లు తలపడగా పరశురాంపురం ఘన విజయం సాధించింది. విజేతలకు సర్పంచ్ ప్రసాదరావు చేతులమీదుగా ట్రోఫీలు అందించారు. కార్యక్రమంలో కోటి, అరుణ్, చంటి, కల్యాణ్, వసంత్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీ అందుకుంటున్న పరశురాంపురం టీమ్

స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టాలి

జలుమూరు: ప్రతినెలా మూడో శనివారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీవో కె.అప్పలనాయుడు సూచించారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు, ఏపీవో శేఖర్, ఈసీ పట్ట సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంపీడీవో ఆర్.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.

సారవకోట: ప్రతీనెల మూడో శనివారం స్వచ్ఛతా దినంగా పాటించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.లోకనాథం సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఇతర మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయనతో పాటు ఎంపీడీవో మోహన్ కుమార్, ఈవోపీఆర్డీ ప్రభాకర్, ఏవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

మెళియాపుట్టి: ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని టెక్కలి ఏపీడీ శైలజ, ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో డ్వామా పీడీ నిర్వహించిన గూగుల్ మీట్‌లో సిబ్బందితో కలిసి వారు పాల్గొన్నారు. ప్రతీ గ్రామంలో పనులు నిర్వహించాలని, పనులు చేయని క్షేత్రస్థాయి సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇస్తామని స్పష్టం చేశారు. ఏపీడీ శైలజ మాట్లాడుతూ ఆదేశించిన లక్ష్యాల మేరకు పనులు చేయాలని, నెలవారీ లక్ష్యాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీవో రవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ పర్యటన నేడు

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్ శనివారం పర్యటించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద స్వచ్ఛాంధ్రా దివాస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అలాగే కొన్ని వీధులను పరిశీలించి చెత్త సేకరణ ఎలా జరుగుతుందనేది పరిశీలిస్తారని ఎంపీడీవో మధుసూదనరావు, ఈవో ద్రాక్షాయినిలు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మెళియాపుట్టి: మండల కేంద్రంలో పేకాట ఆడుతున్న ముగ్గురుని స్థానిక ఎస్‌ఐ రమేష్ బాబు పట్టుకుని అరెస్ట్ చేశారు. శుక్రవారం మెళియాపుట్టి గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న వీరి దగ్గర నుంచి రూ.2,860 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి


రోడ్డును పరిశీలిస్తున్న పీడీ సుధాకర్

పొందూరు: ఎన్‌ఆర్‌ఈజీఎస్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాలు సమన్వయంతో కలిసి పనిచేయాలని సమగ్ర నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకర్‌రావు అన్నారు. మండలంలోని నందివాడ గ్రామంలో సీసీ రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమష్టిగా పనిచేస్తే పనుల్లో మరింత ప్రగతి కనిపిస్తుందన్నారు. మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపడుతున్న పనులు వీలైనంత తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సందీప్, ఇతర ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ


దండాసి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కృష్ణదాస్

సారవకోట: మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం పరామర్శించారు. చీడిపూడి ఎంపీటీసీ మామ చెంచల దండాసి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని, చిన్నగుజ్జువాడలో మృతి చెందిన ఇప్పి బుచ్చయ్య, బలగ కృష్ణ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. వారితో పాటు అవలింగిలో అంపోలు లచ్చుము అనారోగ్యంతో బాధపడుతుండటంతో పరామర్శించారు. ఆయనతో పాటు పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, పార్టీ నాయకులు నక్క తులసీదాస్, యాళ్ల శ్యామసుందరరావు, నిక్కు రాజశేఖర్, బోర శ్రీరామమూర్తి, సర్పంచ్ కొండాల బాబూరావు తదితరులున్నారు.

కాలువ గట్లు శిథిలం



వంశధార కుడి ప్రధాన కాలువ గట్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. గోనెపాడు నుంచి రొట్టవలస వరకు ఉన్న ప్రధాన కాలువకు సంబంధించి ఏఎల్‌నగరం, బప్పడాం, గోనెపాడు, సరుబుజ్జిలి ప్రాంతాల్లో గట్లు కోతకు గురయ్యాయి. సాగునీరు ప్రవహించే సమయంలో కాలువ గట్లకు గండ్లు పడకుండా ఏర్పాటు చేసిన రక్షణ గోడలు సైతం పాడయ్యాయి. అదేవిధంగా కాలువలోకి దిగేందుకు నిర్మించిన మెట్లు కూడా చాలాచోట్ల పగిలిపోయాయి. దీంతో అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

నిరుపయోగం



హిరమండలం మండలంలోని గులుమూరు గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా మారింది. కేంద్రం గ్రామానికి సమీపంలో ఉన్నా స్థానికులు ఖాళీ స్థలాలు, రహదారుల పక్కనే చెత్తను వేస్తున్నారు. దీంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. అందువలన అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– హిరమండలం

నేడు త్యాగరాజు ఆరాధనోత్సవాలు

నరసన్నపేట: స్థానిక శారదా సంగీతాలయంలో శనివారం త్యాగరాజ స్వామి 178వ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు సంగీత ఆలయం నిర్వాహకురాలు పొన్నాన లక్ష్మి తెలిపారు. ఉదయం 7.30 నుంచి సాయంత్రం వరకూ వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా వస్తారన్నారు. సాయంత్రం 7 గంటలకు ప్రత్యేక సంగీత కచేరి నిర్వహిస్తున్నామని, దీంట్లో విజయనగరానికి చెందిన హెచ్.రామ్‌చరణ్ వయోలిన్ వాయిస్తారని, గాత్రం విజయనగరానికి చెందిన మహారాజ్ సంగీత కళాశాల అధ్యాపకురాలు టి.దేవీ సుజాత, మృదంగం విశాఖపట్నానికి చెందిన ఎం.కామేష్‌లు వాయిస్తారని పేర్కొన్నారు. స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తప్పుడు రాతలు సరికాదు


మాట్లాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాతపట్నం: స్థానిక అంగన్‌వాడీ ప్రాజెక్టు సీడీపీవో టి.విమలరాణి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలపై తప్పుడు రాతలు రాయడం సరికాదని పాతపట్నం ప్రాజెక్టుకు చెందిన అంగన్‌వాడీ లీడర్లు బి.శాంతామణి, డి.లలితమ్మ, జి.రాణిలు అన్నారు. స్థానిక శివశంకర్ కాలనీలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ప్రాజెక్టుపై వచ్చిన ఆరోపణలు సరికాదని, అందులో నిజం లేదన్నారు. తమను సంప్రదించకుండా నిందలు వేస్తూ అవాస్తవాలు రాయడం దారుణమన్నారు. సమావేశంలో జి.గీతమ్మ, కె.సావిత్రి, హెచ్.ఉషారాణి, యు.లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు


మహేశ్వరరావును సన్మానిస్తున్న ఎంపీడీవో తదితరులు

పోలాకి: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో జి.వి.రవికుమార్ అన్నారు. మండలంలోని సంతలక్ష్మీపురం పంచాయతీ సెక్రటరీగా ఐదేళ్లు పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన చింతాడ మహేశ్వరరావును స్థానిక సర్పంచ్ యారబాటి నీలవేణి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.


సారవకోట: 30 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు


అ'పూర్వ' సమ్మేళనం


కొత్తూరు: పూర్వ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని కడుము జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో చదివిన సమయంలో తమ జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులతో పాటు ప్రస్తుతం పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. అంతకు ముందు పాఠశాల వ్యవస్థాపకులు వి.జగన్నాథంతో పాటు పలువురి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామారావు, ఎంపీటీసీ సభ్యుడు వి.గోవిందరావు, మాజీ సర్పంచ్ వలురౌతు ధర్మారావు, హెచ్ఎం గొర్లె తిరుమలరావు, ఎస్ఎంసీ చైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని కింతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారంతా అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

సారవకోట: మండలంలోని బుడితి గ్రామంలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు కలిసి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. దీనిలో భాగంగా పలాసలో స్థిరపడిన సుమారు 10 మంది పూర్వ విద్యార్థులు సైతం పాలుపంచుకున్నారు.


పొందూరు: కింతలి పాఠశాల పూర్వ విద్యార్థులు